## క్లుప్తంగా

### ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం


మాట్లాడుతున్న చైతన్య, తదితరులు

మానకొండూర్: మండలంలోని అన్నారం, రంగపేట గ్రామాలలో సోమవారం వాగేశ్వరి డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థుల ఎన్‌ఎస్‌ఎస్ శీతాకాల శిబిరం ప్రారంభమైంది. మాజీ సర్పంచ్‌లు బొట్ల కిషన్, గోపు పావనిశ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. గ్రామాలలోని ప్రజలు మూఢనమ్మకాలు నమ్మకూడదని, పరిశుభ్రత, స్వచ్ఛత అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ చెన్నమల్ల చైతన్య, ఉపాధ్యాయులు జైపాల్‌రెడ్డి, ఎంపీటీసీ ఉమాచారి, అరుణ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


సభ్యత్వ నమోదులో పాల్గొన్న టీచర్లు

చొప్పదండి: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మండలంలోని పలు గ్రామాలలో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే బదిలీ, పదోన్నతులు, సీపీఎస్ రద్దు, తదితర సమస్యలు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తమ హర్షవర్దన్‌రెడ్డి తీసుకెళ్లారని తెలిపారు. సీఎం హామీ ఇచ్చారని త్వరలోనే పరిష్కారమవుతాయనే ఆశాభావంతో ఉన్నామన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, కోల రమేశ్, చొక్కయ్య, తదితరులు పాల్గొన్నారు.

### ఆహ్వానపత్రిక అందజేత


చైర్మన్‌ను ఆహ్వానిస్తున్న కమిటీ సభ్యులు

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని అబాది జమ్మికుంట శ్రీమహాదేవ లింగేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు హాజరుకావాలని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావుకు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఆహ్వానపత్రిక అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దయ్యాల శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

### మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి


కేక్ కట్‌చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక

హుజూరాబాద్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక అన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ముందస్తు మహిళా దినోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. పురుషులతో సమానంగా మహిళలు ఎదగాలని, ప్రస్తుతం చాలా మంది స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకుంటూ ఆర్థికంగా ఎదుగుతున్నారని పేర్కొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కార్యాలయ మేనేజర్ రామ్ మోహన్‌రాయ్, డీఎంసీ శ్రీవాణి, ఏడీఎంసీ మానస, సీఎల్‌ఆర్‌పీ రమాదేవి, స్వరూప, టీఎల్‌ఎఫ్ అనూష ఉన్నారు.

### క్షీరాభిషేకం



సైదాపూర్: మండలంలోని జాగీర్‌పల్లిలో సోమవారం కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఆరు గ్యారంటీల్లో గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కార్యక్రమం నిర్వహించారు. వంద రోజుల్లో కాంగ్రెసు ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేస్తుందని మాజీ ఎంపీపీ కామని వీరేశం అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కులేదన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీందర్, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు తొంట ఇంద్రసేనా, ఉపాధ్యక్షుడు గుడిసె భాస్కర్, కస్తూరి సమ్మయ్య, తాళ్లపల్లి రవి, చంద్రారెడ్డి, యూత్ ప్రెసిడెంట్ అనీల్, మల్లేశ్, కిరణ్, చందర్‌రావు, సారయ్య, రాజు ఉన్నారు.

# ప్రజలకు మంచి చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- సాదాసీదాగా మండల సమావేశం


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్: మార్పు కోసం ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చుకున్నారని, ప్రజలకు మంచి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేతిరెడ్డి వనిత అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీటీసీలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సమావేశంలో మాట్లాడి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మిషన్ భగీరథ నీళ్లు ఇంటింటికీ చేరడం లేదని పొలంపల్లి ఎంపీటీసీ బండారి రమేశ్ తెలిపారు. ట్రాన్స్‌కో సమస్యలపై ఏఈ అరవింద్‌రెడ్డికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. మిషన్ కాకతీయ అధికారులు సంవత్సరాలు గడిచిన పనులు పూర్తి చేస్తేలేరని, రైతులు గ్రామాల్లో ఆవేదన వ్యక్తం చేస్తున్నారని మల్లాపూర్ ఎంపీటీసీ పుప్పాల కనకయ్య అన్నారు. మొగిలిపాలెం గ్రామంలో ఎమ్మెల్సీ కోటాలో కల్యాణ మండపానికి నిధులు మంజూరు చేసినా పనులు మొదలు కావడం లేదని ఎంపీటీసీ పాశం తిలక్ ప్రియరెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వచ్చునూర్ జోగుండ్ల గ్రామాల్లో లూస్ వైర్ల సమస్య తీర్చాలని ఎంపీటీసీ కొమురయ్య కోరారు.

**సమస్యలు పరిష్కరించాలి..**

అనంతరం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ... గత ప్రభుత్వం లాగా సమస్యలు పెండింగ్‌లో ఉండకూడదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో వారి బాధలు పోవాలని అధికారులు అలసత్వం వీడి పెండింగ్ సమస్యలన్నింటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఎండాకాలంలో తాగునీటి సమస్య రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్న తన దృష్టికి తీసుకురావాలని, 24 గంటలు ఎమ్మెల్యే కార్యాలయం తెరిచే ఉంటుందని తెలిపారు. గత ప్రభుత్వ వైఫల్యం కారణంగా గ్రామాల్లో సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ఆ ఇబ్బందులను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని కోరారు. త్వరలోనే మండలంలోని గ్రామాల్లో సందర్శించి సాగునీటి కాలువలను పరిశీలిస్తామని తెలిపారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొచ్చేలా ఎవరూ వ్యవహరించొద్దని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో విజయ్ కుమార్, తహసీల్దార్ కనకయ్య, అధికారులు పాల్గొన్నారు.

**దొంగ సంతకాలతోనే కలెక్టర్ బదిలీ**

ఎన్నికల ముందు గత ప్రభుత్వం నిరుపేదలకు గృహలక్ష్మి కింద ప్రొసీడింగ్ పత్రాలు అందించారని వాటికి నిధులు మంజూరు చేయాలని మొగిలిపాలెం ఎంపీటీసీ పాశం తిలక్ ప్రియరెడ్డి ఎమ్మెల్యే కవ్వంపల్లిని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే గత ప్రభుత్వంలో నిరుపేదలకు ప్రొసీడింగ్ కాపీలు అందచేయలేదని, కేవలం టీఆర్‌ఎస్ కార్యకర్తలకు మాత్రమే ఇచ్చారని, అవి ఇప్పుడు చెల్లవని కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకే గృహలక్ష్మి అందిస్తామని తెలిపారు. అంతేకాకుండా పేరు లేకుండా ఖాళీ ప్రొసీడింగ్ పత్రాలపై ఎన్నికల ముందు పనిచేసిన ఓ కలెక్టర్ గుడ్డిగా సంతకం చేశారని, ఆయన బదిలీ కారణాల్లో అది కూడా ఒకటని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో అలా ఉండదని పార్టీలకతీతంగా నిరుపేదలకు మాత్రమే ఇళ్ల పట్టాలు గృహలక్ష్మి అందిస్తామని తెలిపారు.

### ఆర్యవైశ్య సంఘం జమ్మికుంట అధ్యక్షుడిగా నర్సయ్య


నర్సయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

జమ్మికుంట: జమ్మికుంట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా కేఆర్‌వీ నర్సయ్య గెలుపొందారు. పట్టణంలో సోమవారం సంఘం ఎన్నికల నిర్వహించారు. ఎన్నికల అధికారిగా పబ్బతి రాజగోపాల్, కన్వీనర్‌గా ముక్క వెంకన్న వ్యవహరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు చందారాజు, హుజూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు ఎలిమిల్ల రాజేంద్రప్రసాద్, జమ్మికుంట పట్టణ మాజీ అధ్యక్షుడు అయిత మహేష్, యాద సతీష్, మురళి, ఆర్యవైశ్య ఓటర్లు పాల్గొన్నారు.

- **ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తులు**

శంకరపట్నం: 200యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి జాబితాలో పేర్లు లేనందున అధికారులు సోమవారం లబ్ధిదారులకు దరఖాస్తులను అందజేశారు. అనంతరం దరఖాస్తులను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేశారు.

# ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు


చొప్పదండిలో ఆర్‌ఏఎఫ్, పోలీసుల కవాతు

చొప్పదండి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భాగంగా సోమవారం పట్టణంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, పోలీసులు కవాతు నిర్వహించారు. సీఐ ప్రకాశ్ గౌడ్, ఎస్ఐ ఉపేంద్ర చారి, ర్యాపిడ్ యాక్షన్ ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ నుంచి అంబేద్కర్ చౌరస్తా మీదుగా మార్కెట్ చౌరస్తా వరకు కవాతు సాగగా లయన్స్ క్లబ్ సభ్యులు కేంద్ర బలగాలను శాలువాలతో సత్కరించారు. ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకోవాలని సీఐ కోరారు. ప్రజలంతా శాంతిభద్రతలకు సహకరించాలని ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి శివాజీ చౌరస్తా వరకు ఫ్లాగ్‌మార్చ్ చేశారు. కార్యక్రమంలో చొప్పదండి సీఐ ప్రకాశ్‌గౌడ్, కరీంనగర్ నోడల్ అధికారి మోడం సురేష్, చొప్పదండి ఎస్సై ఉపేంద్రాచారి పోలీస్, సాయుధ బలగాల సిబ్బంది పాల్గొన్నారు.

### లయన్స్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం


రోగులను ఆసుపత్రికి తరలిస్తున్న లయన్స్ సభ్యులు

గన్నేరువరం: మండలకేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రి సహకారంతో సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా టెక్నీషియన్ ప్రభాకర్ కంటి పరీక్షలు చేశారు. 50 మందికి కంటి ఆపరేషన్ అవసరం ఉండటంతో బస్సులో రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ సునీల్, అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, గంప వెంకన్న, బూర శ్రీనివాస్, రామకృష్ణ, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, కాంతాల కిషన్‌రెడ్డి, గొల్లపల్లి రవి, తెల్ల రవీందర్, భాస్కర్, గూడూరు సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

### పశువైద్య శిబిరం

గంగాధర: మండలంలోని కొండాయిపల్లి గ్రామంలో సోమవారం పశువైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశా పశువైద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించి టీకాలు వేస్తామని అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శంకరపట్నం: మండలంలోని మెట్‌పల్లి గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో సిబ్బంది ఆరీఫ్, అహ్మద్, అమీర్‌ఖాన్, స్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### అనుమతులు రద్దు చేయాలి

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామ పరిధిలో నిర్మించిన ఓ రెడిమిక్స్ అనుమతులను తక్షణం రద్దు చేయాలని గ్రామానికి చెందిన మామిడి రాజశేఖర్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు శబ్ద, వాయు కాలుష్యంతో పాటుగా శ్వాసకోస వ్యాధులబ బారినపడే అవకాశం ఉందని వెంటనే అనుమతులు రద్దు చేసి ఆదుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

### అక్రమ ఇంటి నిర్మాణం కూల్చివేయాలని డీపీఓ ఆదేశం

శంకరపట్నం: మండలంలోని కరీంపేటలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఓ ఇంటిని కూల్చివేయాలని డీపీఓ రవీందర్ ఆదేశాలు జారీ చేశారు. గ్రామంలో వనపర్తి హరీశ్ సొంతభూమిలో అంకతి రాజయ్య అతని సోదరులు అక్రమంగా ఇంటిని నిర్మించారని గతంలో గ్రామకార్యదర్శి, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, డీపీఓగా వీరబుచ్చయ్య పనిచేసిన సమయంలో విచారణ చేసి నిర్మాణం కూల్చివేయాలని చెప్పినా ఇప్పటివరకు అధికారులు చర్యలు తీసుకోలేదని ఫిబ్రవరి 26న ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈవిషయమై గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా అక్రమంగా నిర్మించిన ఇంటిని కూల్చివేయాలని పంచాయతీ కార్యదర్శితో పాటు మండల అధికారులకు డీపీఓ రవీందర్ ఆదేశాలు జారీ చేశారు.

### నేడు బీఆర్‌ఎస్ సమావేశం

రామడుగు: మండలంలోని షానగర్ గ్రామ పరిధి ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం బీఆర్‌ఎస్ రామడుగు మండల స్థాయి నాయకుల, కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నామని పార్టీ మండల అధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, రామడుగు సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్వర్‌రావు పలువురు హాజరవుతారని వివరించారు.

## సంక్షిప్త వార్తలు

### దళితబంధు సాధన సమితి సభ్యుల సమావేశం


సమావేశంలో సురేశ్, నరేశ్, ఆకాశ్, తదితరులు

జమ్మికుంట: రెండో విడుత దళితబంధు నిధుల విడుదలకు పోరాటంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు మద్దతు తెలిపారని దళిత బంధు సాధన సమితి సభ్యులు కొలుగూరి సురేశ్, మంద రాజేష్, కొలుగూరి నరేష్, ఆకినపల్లి ఆకాశ్, దాసరావు నాగరాజు, రక్షిత్ అన్నారు. సోమవారం హుజూరాబాద్ నియోజకవర్గ స్థాయి రెండో విడుత దళితబంధు నిధుల మంజూరుపై వివిధ రాజకీయ పార్టీ నాయకులతో కలిసి పట్టణంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దళితజాతి అభ్యున్నతికి వివిధ పార్టీలలో ఉన్న దళితులు పాటు పడేలాగా కార్యాచరణ రూపొందించామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు సంపత్, బీఎస్పీ నాయకులు రవీందర్, ఆకినపల్లి శిరీషప్రవీణ్, బీజేపీ నాయకులు రాజేశ్ ఠాకూర్, రాజు, సారయ్య, రవి, శ్రీనివాస్, 57 ఉప కులాల సంఘం నేత వేణు, బీఆర్‌ఎస్ రమేశ్, డీఎస్పీ నాయకులు రాకేశ్, టీజేపీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

### పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న గౌడ సంఘం నాయకులు

హుజూరాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని వీ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో 10న జిల్లా గౌడ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సన్మానోత్సవం నిర్వహించనున్నామని గౌడ సంఘం నాయకులు తెలిపారు. సోమవారం పట్టణంలో సన్మానోత్సవ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి గౌడ సంఘం నాయకులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నేరేళ్ల మహేందర్‌గౌడ్, పంజాల రాంశంకర్, తాళ్లపల్లి రమేష్, చందు శ్రీనివాస్, కుర్ర శ్రీనివాస్, ఎల్లగౌడ్, తాళ్లపల్లి మల్లయ్య, వెంకటేష్, ఐలయ్య, భిక్షపతి, అశోక్, తిరుపతి తదితరులు ఉన్నారు.

### ఉద్యమకారుల కృతజ్ఞత సభ విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న కుమారస్వామి, సదానందం

సైదాపూర్: రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో 12న హైదరాబాద్‌లో నిర్వహించే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృతజ్ఞత సభకు మండలంలోని తెలంగాణ ఉద్యమకారులు అధిక సంఖ్యలో తరలి రావాలని జిల్లా ఫోరం అధ్యక్షుడు కనకం కుమారస్వామి కోరారు. సోమవారం సైదాపూర్‌లో ఉద్యమకారుల మండల సమావేశం మండల అధ్యక్షుడు వస్తాదుల సదానందం అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్రం కోసం జైలు జీవితం గడిపామని జిల్లా ఫోరం అధ్యక్షుడు కుమారస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను దశాబ్దకాలంగా కోరినా ఫలితం లేదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉద్యమకారులకు ఇండ్ల స్థలాలతో పాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించడంతో ఉద్యమకారుల్లో ఆశలు చిగురించాయన్నారు. ఆ దిశగా కార్యాచరణ చేపట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞత తెలిపేందుకు సభ నిర్వహిస్తున్నట్లు కుమారస్వామి తెలిపారు.

### ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక: మండలంలోని చల్లూరు మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. గ్రామానికి చెందిన తీగల రాము, తీగల నాగరాజు తమ ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా వేర్వేరు ప్రాంతాల్లో పట్టుకున్నామని, ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి ఇరువురిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

జమ్మికుంట: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ లారీ పట్టుకొని కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వరగంటి రవి తెలిపారు. మండలంలోని తనుగుల గ్రామ శివారులో జయశంకర్ భూపాలపెల్లి జిల్లా ముత్తారం నుంచి అనుమతి లేకుండా లారీలో ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నారు. లారీ డ్రైవర్ గద్దపాటి సురేష్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ రవి తెలిపారు.

### ఆర్థికసాయం

వీణవంక: మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన దుకిరే రాజు ఇటీవల మృతిచెందాడు. గ్రామానికి చెందిన కర్నకంటి భాస్కర్‌రెడ్డి అనే యువకుడు హెల్పింగ్ హాండ్స్ పేరుతో వాట్సప్ గ్రూపు క్రియేట్ ఆర్థికసాయం కోరాడు. గ్రామస్తులు, వ్యాపారులు, ఇతర ప్రాంతాలలో స్థిరపడిన వారి నుంచి రూ.రెండు లక్షల విరాళాలు సేకరించి సోమవారం మృతుడి కుటుంబానికి అందించారు. ఈసందర్భంగా భాస్కర్‌రెడ్డిని గ్రామస్తులతో పాటు మండల ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

గంగాధర: మండలంలోని గట్టుభూత్కూర్ గ్రామానికి చెందిన బోయిని లచ్చయ్య అనారోగ్యంతో మృతిచెందగా అంత్యక్రియలకు తాజామాజీ సర్పంచు కంకణాల విజయేందర్‌రెడ్డి రూ. ఐదువేలు అందజేశారు. విజయేందర్‌రెడ్డి గత కొద్ది సంవత్సరాలుగా గ్రామంలో పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తూ వారికి అండగా నిలుస్తున్నాడు.

### ఈటలను కలిసిన బీజేపీ నాయకులు

వీణవంక: బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ మంత్రి ఈటల రాజేందర్‌ను హైదరాబాద్‌లోని తన నివాసంలో మండలంలోని బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మల్కాజిగిరి ఎంపీ టికెట్ కేటాయించడం పట్ల ఈటలను శాలువాతో సన్మానించారు. మల్కాజిగిరి ప్రాంత ప్రజలు ఈటలను భారీ మెజార్టీతో గెలిపిస్తారని ఆకాంక్షించారు. బీజేపీ హుజూరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ మాడ గౌతంరెడ్డి, పెద్ది మల్లారెడ్డి, అఖిల్ పాషా, తదితరులు ఉన్నారు.

# ప్రజాపాలన హెల్ప్ డెస్కు ప్రారంభం


సైదాపూర్: హెల్ప్ డెస్కును ప్రారంభిస్తున్న ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి

చొప్పదండి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ప్రజా పాలన సేవా కేంద్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ సోమవారం ప్రారంభించారు. గతంలో ప్రజా పాలనలో లబ్ధి కోసం ధరఖాస్తు చేసుకున్న వారికి సవరణలకు అవకాశం కల్పించామని, ఉదయం పదిన్నర గంటల నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు సేవా కేంద్రం అందుబాటులో ఉంటుందని తెలిపారు. దరఖాస్తుదారులు పాసుపోర్టు సైజు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కరంటు బిల్, గ్యాస్ బిల్ తీసుకురావాలని సూచించారు. గతంలో ధరఖాస్తు చేసుకొన్న వాటికి సంబంధించిన సవరణలకు అవకాశం కల్పించామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ నాగరాజు, వైస్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, అశోక్, మహేశ్, మల్లేశం, పెరుమాండ్ల గంగయ్య గౌడ్, నలుమాచు రామక్రిష్ణ, మేనేజర్ ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

సైదాపూర్: ప్రజాపాలన హెల్ప్ డెస్కును మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకోలేని వారి కోసం హెల్ప్ డెస్కు ద్వారా నిరంతరం దరఖాస్తులు తీసుకుంటుందని ఆయన అన్నారు. అర్హులైన లబ్ధిదారులు మండల పరిషత్ కార్యాలయంలో హెల్ప్ డెస్కులో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో భూక్యా యాదగిరి, తహసీల్దార్ మంజుల, ఎంపీటీసీలు ఓదేలు, ఇందిరసుధీర్, అరుణమల్లయ్య ఉన్నారు.

గన్నేరువరం: గన్నేరువరం గ్రామ పంచాయతీలో ప్రజా పాలన సేవ కేంద్రాన్ని సోమవారం ఎంపీడీవో శంకర్ ప్రారంభించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అమలు చేయడానికి ప్రభుత్వం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు వెంకటేశం, మల్లికార్జున్, కారోబార్ మాధవరావు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

### భూమి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి


వినతిపత్రం అందజేస్తున్న గొల్ల కురుమలు

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని బీరప్ప దేవాలయం భూమిని ఆక్రమంగా పట్టాచేయించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని గొల్ల కురుమ కులస్తులు సోమవారం తహసీల్దార్ రాణికి వినతిపత్రం అందజేశారు. సర్వే నెంబర్ 768లో బీరప్ప ఆలయానికి చెందిన పదిగుంటల భూమిని రావుల సంపత్, గుడికందుల బుచ్చమ్మ అక్రమంగా పట్టా చేయించుకొని వారసులు గుడికందుల ఎల్లయ్య, గుడికందుల మల్లేష్, గుడి కందుల రాజుకు ధరణిలో నమోదు చేయించారని, రెవెన్యూ సిబ్బందిని తప్పుదోవ పట్టించి అక్రమంగా పట్టా చేసుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని ఆలయ భూమిపై తగు విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో దంసాని స్వామి,గట్టయ్య, ఐలయ్య, మల్లయ్య, అశోక్ తదితరులు ఉన్నారు

# రాముని పేరుతో ఓట్ల రాజకీయం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి

తిమ్మాపూర్: రాముని పేరుతో బీజేపీ ఓట్ల రాజకీయం చేస్తోందని, బీజేపీ పాలనలో దేశంలో అనేక స్కామ్‌లు జరిగాయని, వాటిని కప్పిపుచ్చుకోవడానికి దేవుడి పేరు వాడుతున్నారని మానకొండూర్ ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆరోపించారు. మండలంలోని కొత్తపల్లి ఫంక్షన్ హాల్‌లో సోమవారం కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి, కాంగ్రెస్ సీనియర్ నేత అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాముడు అందరికీ దేవుడని, ఓట్ల కోసం, వ్యాపారం కోసం, డబ్బు సంచులతో ప్రభుత్వాలను పడగొట్టాలని రాముడు చెప్పాడా అంటూ బీజేపీని ప్రశ్నించారు.

**ఎంపీగా ఎన్ని నిధులు తెచ్చారు..**

ఎంపీగా బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎన్ని నిధులు తీసుకొచ్చాడు, ఏమీ అభివృద్ధి పనులు చేశాడో ప్రజలకు చెప్పాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆయనకున్న నిధులను ఖర్చు చేయని అసమర్థుడైన బండి సంజయ్ కి సిగ్గుండాలని విమర్శించారు. బండి ఏం చేశాడని యాత్ర చేస్తున్నాడని ప్రశ్నించారు. అభివద్ధి కోసం కనీసం ప్రయత్నం కూడా చేయలేదన్నారు. తిమ్మాపూర్ మండలం శుభసూచకమని, అసెంబ్లీ ఎన్నికల్లో తిమ్మాపూర్ నుంచి ప్రచారం మొదలుపెట్టిన కవ్వంపల్లి గెలిచాడని, అలాగే పార్లమెంట్ ఎన్నికల్లో సైతం గెలుస్తామని స్పష్టం చేశారు. మాట ఇచ్చిన కాంగ్రెస్ తెలంగాణ ఇస్తే మోసపూరిత వాగ్దానాలు చేసిన కేసీఆర్ మాటలు నమ్మి గెలిపించారని, ఆయన ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ వాగ్దానాలను అమలు చేస్తూ మాట నిలబెట్టుకుంటుందని అన్నారు. నాడు వైస్ హయాంలో నిలబెట్టుకున్నట్లు గుర్తు చేశారు.

**కార్యకర్తలే నిజమైన నాయకులు....**

పార్టీకి కార్యకర్తలే నాయకులని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. తన గెలుపునకు ఎంతో కృషి చేశారని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడురమణారెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణగౌడ్, రంగారావు, రమేష్, సంపత్, కొత్త తిరుపతిరెడ్డి, అనిల్ , కొండలరావు, లక్ష్మారెడ్డి, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

### బైక్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

జమ్మికుంట: బైక్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా.. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వరగంటి రవి తెలిపారు. పట్టణంలోని బస్టాండ్ వద్ద ఇల్లందకుంట మండలం బుజునూర్ గ్రామానికి చెందిన ఎడ్ల నారాయణరెడ్డి దంపతులు ఆటో దిగి బస్టాండ్‌లోకి వస్తున్న క్రమంలో అబాది జమ్మికుంటకు చెందిన ఇల్లందుల రాజు అనే వ్యక్తి బైక్‌తో వెనక నుంచి ఢీకొట్టాడు. నారాయణరెడ్డి తలకు తీవ్ర గాయాలు కాగా.. చికిత్స నిమిత్తం హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి కుమారుడు కిషన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.